
# ఫ్లాష్ బ్యాక్




పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# బి.ఎస్. రంగా

## కినీమా 1956 ఆగస్టు సంచిక నుంచి

విక్రమ్ స్టూడియో ప్రారంభోత్సవంలో పూజాసమయాన సినిమా పురోహితుడు అందించే గ్రంథాలకు అభివాదం తెలుపుతున్న బి. ఎస్. రంగా, వారి సోదరుడు గరుడాచారి, వారి మిత్రుడు పార్థ. పాపలు రంగా సంతానం.



**చలనచిత్ర పరిశ్రమలో** సామాన్యమైన టెక్నీషియన్‌గా అడుగుపెట్టి స్టూడియో యజమాని అంతస్థువరకు ఎగబ్రాకగలిగిన వ్యక్తులు చాలా అరుదు. అందులో బి.ఎస్. రంగా ఒకడు.

రంగా ఛాయా చిత్రగ్రాహకుడుగా 1937లో చిత్రపరిశ్రమలో ప్రవేశించి 1956 నాటికి స్టూడియో యజమాని కాగలగడానికి ముఖ్యకారణాలు అతని స్వయం కృషి, దానికి అనుపానం అదృష్టం.

రంగా హైస్కూలు విద్యార్థి దశలోనే

కెమెరా చేత బట్టాడు. స్కూలు పుస్తకాలతోబాటు ప్రకృతినంతటినీ సచిత్రంగా ఇముడ్చుకోగల కెమెరా కూడా అతనికి ఆయుధమైంది.

హాబీగా కుదిరే ఛాయాచిత్రగ్రాహక శక్తి ప్రతివారికీ వ్యసనంగా పరిణమిస్తుంది. అచలన చిత్రాలను అంతర్జాతీయ బహుమతులకు అందించటం ఆ వ్యసనం యొక్క పర్యవసానంగా ఏర్పడుతుంది. ఆ విధంగానే రంగా స్విట్జర్లాండ్, ఇంగ్లండ్‌లలో జరిగిన పోటీలకు అచలన చిత్రాలను పంపి మూడు అంతర్జాతీయ బహుమతులను అందుకున్నాడు. అంతేకాకుండా లండన్‌లో ఫోటోగ్రఫిక్ సొసైటీ అసోసియేట్‌గా ఎన్నుకోబడ్డాడు.

అప్పటికి అతని వయసు సరిగ్గా 20 ఏళ్ళు. కాలేజీ చదువు బి.ఎస్ సి సాగుతున్నది. అంతటి లేత వయస్సులోనే అంతర్జాతీయ ప్రశంసలను అందుకున్న రంగాకు సరియైన  సలహా సకాలంలో అందింది. అది 1937వ సంవత్సరం. టాకీ పుట్టి 5 ఏళ్ళయింది. బొంబాయిలో టాకీ నిర్మాణాలు ఉధృతంగాను, మదరాసులో ఆరంభదశలోను సాగుతున్న రోజులవి. బొంబాయిలోని రంజిత్ మూవీ టోన్‌కు ఖ్యాతి వున్న రోజులవి. ఆ సంస్థలో భాగస్థుడైన డాక్టర్ పటేల్ బెంగుళూరులో ఉంటూండేవారు. ఆయన రంగాకు సినిమాటోగ్రఫీ నేర్చుకోరాదా అని సూచించారు. వెంటనే అంగీకరించాడు. అంతకంటే ముఖ్యమైన అంశం తలిదండ్రుల అనుమతి. రంగాకు వారి అనుమతి అందటంలో ఏమాత్రం ఆలస్యం జరగకపోవటం అతని అదృష్టం.

రంగా వెంటనే బొంబాయికి వెళ్ళాడు. రంజిత్ మూవిటోన్ లేబరేటరీలో అప్రెంటిస్‌గా చేరాడు. ఒక ఏడాదిలో 'లాబ్'లో పని అంతా నేర్చుకున్నాడు. ఆ తరవాత కెమెరా శాఖలో చేరాడు. .అప్పటికి రంజిత్ కెమెరామన్‌గా శ్రీ కృష్ణగోపాల్ పనిచేస్తూండేవారు. ఆయనకు అసిస్టెంట్‌గా రంగా వుంటూ "తులసీదాస్", "అచ్చుత్", "హోలీ", "పాగల్", పర్‌దేసి", "ప్యాస్", "మెహ్‌మాన్" హిందీ చిత్రాలకు పనిచేశాడు.

కెమెరామన్‌గా సద్గురువు వద్ద చక్కని అనుభవం సంఘాదించిన తరవాత రంగ మదరాసు చేరుకుని జెమినీ స్టూడియోలో చేరి శ్రీ ఆది ఇరానీ వద్ద ఆపరేటివ్ కెమెరామన్‌గా పనిచేశాడు. కొంతకాలమైన పిమ్మట శ్రీ ఇరానీ జెమినీ స్టూడియోను వదిలి బొంబాయి వెళ్ళాడు. రంగాను జెమినివారు ఛాయాచిత్ర దర్శకుడుగా నియమించారు.

జెమినీ సంస్థకు ఆర్థిక బలం ఆర్జించి పెట్టిన "బాలనాగమ్మ" చిత్రానికి  రంగా కెమెరామెన్. మదరాసులోని స్టూడియోలో అడుగుపెట్టిన తరువాత రంగా స్వతంత్రంగా కెమెరాను నడిపిన ఫలంగా విడుదలైన చిత్రం "బాలనాగమ్మ". ఆ తరువాత జెమినీవారి "నందనార్", "దాసి, అపరంజు", తమిళనాడు టాకీస్ వారి "నారదర్" చిత్రాలకు ఆయన పనిచేశారు.

1946లో రంగాకు స్వతంగా చిత్ర నిర్మాణం సాగించాలనే కుతూహలం కలిగింది. జెమినీ సంస్థను వదిలిపెట్టాడు. బొంబాయి వెళ్ళి బాంబే టాకీస్ స్టూడియోలో తమిళ భాషలో "భక్త తులసీదాస్" చిత్రాన్ని కెమెరామన్‌గా, డైరెక్టర్‌గా ఉండి

తయారు చేశాడు. అతనిలో అప్పటికి ఆవేశం పొంగుతున్నంతగా అదృష్టం చిందలేదు. "భక్త తులసీదాస్" ఆర్థికంగా విజయం పొందలేదు. స్వంత చిత్రనిర్మాణానికీ, దర్శకత్వానికీ తాత్కాలికంగా స్వస్తి చెప్పి రంగా ఇతర నిర్మాతల చిత్రాలకు కెమెరామన్‌గా పనిచెయ్యటానికి పూనుకున్నాడు. భరణీవారి చిత్రం "లైలామజ్ను" ఆయన కెమెరామన్‌గా వేతనం మీద పని చేసిన చిత్రాలలో మొదటిది. అదేవిధంగా ఆయన "మొదటిరాత్రి", "తిరుగుబాటు", "మాయలమారి", "దీక్ష", "నా చెల్లెలు", (తెలుగు, తమిళం) "స్త్రీ సాహసం", "శాంతి", "దేవదాసు (తెలుగు, తమిళం) "నిరుపేదలు", "మనంబోల మాగళ్యం", "కణవనే కన్ కండదైవం" చిత్రాలకు కెమెరామన్‌గా పనిచేశారు.

1950లో రంగా బెంగుళూరులో ఆధునికమైన ఆటోమాటిక్ ప్రాసెసింగ్ లేబరేటరీ స్థాపించి, కొంతకాలం తరువాత లాబ్‌ను చెన్నపురి తెచ్చారు.

అంతటితో ఆయనకు చిత్రనిర్మాణంలోని మెళుకువలు, కెమెరా దర్శకత్వ శాఖలలో అనుభవం అర్ధమైనవి. ఆ ఊతతో ఆయన విక్రం ప్రొడక్షన్స్ అనే సంస్థను స్థాపించి "మాగోపి" తెలుగు చిత్రం తన దర్శకత్వంతో తానే కెమెరామన్‌గా ఉండి తయారు చేశాడు. అది విజయం పొందింది. నిర్మాతగా రెండవ యత్నంలో విజయం పొందిన ఘనత రంగాకు దక్కింది. "మా గోపీ" అనంతరం ఆయన తెలుగు, తమిళ చిత్రం "రామకృష్ణ" తయారు చేశాడు. ఈ రెండు విజయాల ఫలితంగా రంగా స్వంతంగా స్టూడియో నిర్మించే ఉన్నత స్థితికి వచ్చాడు. కోడం బాకంలోని "చందమామ" ఆవరణకు ఎదురుగా ఉన్న స్థలంలో విక్రం స్టూడియోస్‌ను అందంగా నిర్మించి జూన్ 30 వ తేదీన జెమినీ అధిపతి శ్రీ వాసన్‌గారిచే ప్రారంభోత్సవం  జరిపించాడు.

స్వంత స్టూడియోలో ఆయన ఇప్పుడు తెలుగు, తమిళం, కన్నడ భాషలలో "భక్తమార్కండేయ" చిత్ర నిర్మాణం కొనసాగిస్తున్నాడు.

టెక్నీషియన్‌గా రంగా వెండి తెర పరిశ్రమలో చేరి అంచెలుగా దర్శకుడు, నిర్మాతస్థానాలనే కాకుండా స్టూడియో యజమానిగా అధిరోహించాడు. "రైతురాజు" చిత్రాన్ని తెలుగు, తమిళ భాషలలోను, "ఛత్రపతి శివాజీ" గాధను వివిధ వర్ణ చిత్రంగానూ తయారుచేయటానికి ఆయన సన్నాహాలు జరుపుతున్నాడు.

Post your comments